క్లుప్తంగా

మెరుగైన సేవలందించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు

లక్కవరపుకోట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి(పీహెచ్‌సీ) వచ్చే రోగులకు మెరుగైన సేవలందించాలని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, ఎంపీపీ, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ గేదెల శ్రీనివాసరావు వైద్యసిబ్బందికి సూచించారు. పీహెచ్‌సీలో ఎంపీపీ అధ్యక్షతన సోమవారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. వైద్యాధికారి బి.అనిల్‌కుమార్ మాట్లాడుతూ వైద్యారోగ్య శాఖ ద్వారా పీహెచ్‌సీ అభివృద్ధికి రూ.85 వేలు మంజూరయ్యాయని చెప్పారు. ఈనిధులతో ఆస్పత్రికి అవసరమైన విద్యుత్ లైట్లు ,బెడ్ షీట్‌లు, ఫర్నీచర్, స్టేషనరీ కొనుగోలు, ఇతర అవసరాలకు వినియోగించాలని కమిటీ తీర్మానించింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు సేవలందించాలని ఆదేశించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

కొత్తవలస: 'నత్తనడకన ధాన్యం కొనుగోలు' శీర్షికతో సాక్షిలో ఆదివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని బలిఘట్టాం గ్రామ రైతు సేవాకేంద్రం(రైతు భరోసా కేంద్రం)లో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షానికి తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని చెప్పారు.వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు ఎల్.విజయ మాట్లాడుతూ మండలంలో సుమారు 4 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు లక్ష్యం పెట్టుకున్నట్లు తెలిపారు. టీడీపీ నాయకులు గొరపల్లి రాము,కొరుపోలు అప్పారావు,వేంపల అప్పారావు,రత్నాజీ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ



మాట్లాడుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రావాడ సత్యనారాయణ

గజపతినగరం: ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రావాడ సత్యనారాయణ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాతీయ కాలుష్య నివారణ, వరల్డ్ కంప్యూటర్ లిటరసీ డే కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. అలాగే కంప్యూటర్ పరిజ్ఞానం ఉంటే అన్ని రంగాల్లోనూ రాణించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఎం.శ్రీనివాసరావు, జె.షర్మిలరాణి, డీఎస్.మాధవరావు, మోహన్‌రాజు, ఎన్ఎస్ఎస్ పీఓలు శ్రీనివాసరావు, భానుప్రసాద్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా రైల్వే లైన్ పనులు



ట్రాక్ పనులు చేస్తున్న కార్మికులు

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి రైల్వేగేట్ వద్ద మూడో లైన్ పనులు చురుగ్గా సాగుతున్నట్లు రైల్వే అధికారి శరత్ తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు వరకు బీటీ రోడ్డులో వాహనాల రాకపోకలు నిలిపి వేసి ట్రాక్‌లు అమర్చారు. మంగళవారం కూడా పనులు చేపడతామని రైల్వే అధికారి శరత్ తెలిపారు. విజయనగరం నుంచి దత్తిరాజేరు వచ్చే ప్రయాణికులు గజపతినగరం నుంచి పోరలి మీదుగా.. సాలూరు, పార్వతీపురం నుంచి దత్తిరాజేరు వెళ్లాల్సిన వారు షికారు గంజి కూడలి మీదుగా వెళ్లాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించండి..

వేపాడ: మండలంలోని కరకవలస పంచాయతీలో గిరిశిఖర మారిక గ్రామస్తులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సూర్యనారాయణను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు.తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని, పాఠశాల భవనం నిర్మించాలని కోరారు. ఎంపీడీఓ స్పందిస్తూ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు.

దివ్యాంగుల సేవకే అంకితం



వంద ఎకరాల భూమి ఉన్న కుటుంబ నేపథ్యం.. విలాసవంతమైన జీవితాన్ని గడిపే అవకాశం. బెంగళూరు విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ పట్టా సాధించారు.అమెరికాలో ఇంజినీర్‌గా స్థిరపడాలన్నది ఆయని కల. కానీ అతని ప్రాణస్నేహితుడి మరణం ఆయన్ని తీవ్రంగా కలిచి వేసింది. ఆ ఘటన ఆయన ఆలోచనలను, జీవిత గమనాన్ని మార్చేసింది. మిత్రుని మరణం కొత్త దిశను చూపింది. ఇక తన జీవితం పేద దివ్యాంగులకు సేవే చేయడానికే అంకితం చేయాలని నిర్ణయించుకున్నారు. విలాసవంత మైన జీవితాన్ని వదిలి దివ్యాంగులకు సేవ చేసేందుకు 24 ఏళ్ల వయస్సులో శ్రీ గురుదేవ పేరిట చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేసి రెండున్నర దశాబ్దాలుగా నిస్వార్థ సేవ అందిస్తున్నారు. దివ్యాంగులకు సేవ చేసేందుకు పెళ్లి కూడా చేసుకోలేదు. ఆయనే కొత్తవలస మండలం మంగళపాలెం గ్రామానికి చెందిన రావర్తి జగదీష్ బాబు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా గురుదేవ ట్రస్టు సేవలపై ప్రత్యేక కథనం



ట్రస్టులో తయారు చేసిన కృత్రిమ అవయవాలు

- రెండున్నర దశాబ్దాలుగా దివ్యాంగులకు నిస్వార్థ సేవలందిస్తున్న జగదీష్‌కుమార్
- గురుదేవ ట్రస్టు ద్వారా సుమారు రూ.100 కోట్లతో 2.40 లక్షల మందికి కృత్రిమ అవయవాల పంపిణీ
- ఆరు రాష్ట్రాలకు విస్తరించిన ట్రస్టు సేవలు

కొత్తవలస:

మండలంలోని మంగళపాలెం గ్రామ సమీపంలోని శ్రీ గురుదేవ చారిటబుల్ ట్రస్టు దివ్యాంగుల పాలిట దేవాలయంలా నిలిచింది. దివ్యాంగులు, ప్రమాదాల్లో కాళ్లు,చేతులు పోగొట్టుకున్న వారికి ఈట్రస్టు కృత్రిమ అవయవాలు అందజేసి వారి జీవితాల్లో వెలుగులు నింపుతూ, వారిని చేయిపట్టి నడిపిస్తోంది. దివ్యాంగుల సేవ కోసం ట్రస్టు చైర్మన్ రావర్తి జగదీష్‌బాబు తన జీవితాన్నే అంకితం చేశారు. జగదీష్‌బాబుది కొత్తవలస మండంలోని మంగళపాలెం గ్రామం. రావర్తి భాస్కర్ కన్నప్ప, సుబ్బలక్ష్మి దంపతుల నలుగురు సంతానంలో జగదీష్ బాబు ఒకరు. ఈయన తోడ ముగ్గురు అక్క చెల్లెళ్లు ఉన్నారు. ఈయన తండ్రి సుమారు వంద ఎకరాల భూస్వామి. రాజమండ్రిలోని సత్యసాయి గురుకులంలో 10వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుకున్నారు. తర్వాత ఇంజినీరింగ్ బెంగుళూరులో చదివి గోల్డ్ మెడల్ సాధించారు. అమెరికాలో ఉద్యోగం చేయాలనే ఆలోచనతో ఉన్న సమయంలో తనతో కలిపి ఇంజినీరింగ్ చదువుకున్న అనంతపురం జిల్లాకు చెందిన మిత్రుడు రాజశేఖర్‌కు రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఆయన ఒక కాలు పోగొట్టుకున్నాడు. మిత్రుడికి జైపూర్ కృత్రిమ కాళ్లు అమర్చాలని జగదీష్‌బాబు నిర్ణయించుకున్నారు. రాజశేఖర్‌తో కలిసి జైపూర్ వెళ్లాలనుకున్నప్పటికీ ఆయన వెళ్లలేకపోయారు. దీంతో రాజశేఖర్ తన తల్లితో కలిసి రైలులో జైపూరు పయనమయ్యారు. ఈప్రయాణంలో జరిగిన ప్రమాదంలో రాజశేఖర్ మృతి చెందాడు. మిత్రుడి మరణంతో జగదీష్‌బాబు కుంగిపోయారు. కాళ్లు,చేతులు లేని వారు కృత్రిమ అవయవాలకు అంత దూరం వెళ్లాలా, ఇది అందరికీ ఇది సాధ్యమేనా అనే ఆలోచన ఆయన్ని తొలిచివేసింది. ఈ ప్రాంతంలోనే మనమే కృత్రిమ అవయవాలు ఎందుకు తయారు చేయకూడదని ఆలోచన చేశారు.ఆయనకు కృత్రిమ అవయవాల తయారీలో ప్రావీణ్యం కలిగిన నలినేష్‌బాబు తోడైయారు. దీంతో 2000వ సంవత్సరంలో తన స్వగ్రామం మంగళంపాలెంలో శ్రీగురుదేవ ట్రస్టు ఏర్పాటు చేశారు. ఇక్కడే కృత్రిమ అవయవాలను తయారుచేసి ఎందరో దివ్యాంగులకు ఉచితంగా వాటిని అందిస్తున్నారు.

ఆస్తులను కరగదీసి... వక్తిగత జీవితాన్ని పక్కనపెట్టి..

ఆంధ్రప్రదేశ్‌తో పాటు చత్తీస్‌ఘడ్, తమిళనాడు, ఒడిసా, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు ఈ ట్రస్టుసేవలు విస్తరించాయి. ఇప్పటి వరకు సుమారు 2,40,000 మందికి కృత్రిమ కాళ్లు,చేతులు, పోలియోకాలిపర్స్, వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లు, ఇతర అవయవాలను అందజేశారు. ట్రస్టు సేవల కోసం తనకు విజయగరం,విశాఖపట్నం,తూర్పుగోదావరి జిల్లాల్లో ఉన్న సుమారు 50 ఎకరాల భూమిని అమ్మేశారు. దివ్యాంగుల సేవకు ఎక్కడ ఆటంకం కలుగుతుందోనని పెళ్లి కూడా చేసుకోలేదు. గురుదేవా ట్రస్టు సేవలకు ఫిదా అయ్యి ఎందోమంది దాతలు లక్షల రూపాయల విరాళాలను అందిస్తున్నారు. ఆయన సేవలకు ఎన్నో పురస్కారాలు,అవార్డులు దక్కాయి. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు ,ముఖ్యమంత్రులు, ప్రముఖులు ట్రస్టును సందర్శించి జగదీష్‌కుమార్ సేవలను ప్రశంసించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. తాజాగా సుప్రీం కోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి గురుదేవ ట్రస్టును సందర్శించి జగదీష్‌బాబును ప్రశంసించి భారతదేశంలో అత్యున్నత అవార్డు ఆయనకు ప్రధానం చేయాలని ప్రభుత్వానికి సూచించారు.



గవర్నర్ బండారు దత్తాత్రేయ సమక్షంలో దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు తొడుగుతున్న జగదీష్‌బాబు(ఫైల్)





కృత్రిమ అవయవాలను పరిశీలిస్తున్న సుప్రీం కోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి.రమణ



ఆసియాలోనే అతిపొడవైన పి.గిట్టయ్యకు అమర్చిన కృత్రిమ కాళ్లు(ఫైల్)

అమ్మ అండగా నిలిచింది.



ఇంజినీరింగ్ పూర్తి చేసి, ఇక సంపాదన ప్రారంభిస్తాడనే తరుణంలో ఉన్న ఆస్తులను కరగదీసి దివ్యాంగులకు సేవ చేస్తానంటే ఏ తల్లీ ఒప్పుకోరు. కానీ నా విషయంలో మా అమ్మ సుబ్బలక్ష్మి నన్ను ఎంతగానో ప్రోత్సహించారు. ఎవరి కోసమో ఆస్తులను తగలేస్తున్నాడని బంధువులు విమర్శించినా అమ్మ పట్టించుకోలేదు.నాకు అండగా నిలించింది.ఒకరి సాయంతో ట్రస్టుకు వచ్చి కృత్రిమ కాళ్లు అమర్చిన తర్వాత సొంతంగా నడిచి వెళుతున్న దివ్యాంగుల్లోని సంతోషం అమ్మకళ్లలో కనిపించింది. ఇది చూసి ఈజన్మకు ఇంత కన్నా ఇంకేం కావాలి ఏం కావాలిరా నాన్న అని అన్న అమ్మ మాటలు నాకు కొండంత బలాన్ని ఇచ్చాయి.

– రావర్తి జగదీష్‌బాబు , గురుదేవ చారిటబుల్ ట్రస్టు చైర్మన్

ఆస్పత్రి భవన నిర్మాణాల పరిశీలన

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ప్రాంగణంలో వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులను రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. అనంతరం అధికారులు, వైద్యులు, భవన నిర్మాణ కాంట్రాక్టర్‌తో సమా వేశమయ్యారు. భవన నిర్మాణ పనులను 2025 మార్చి నెలాఖరుకు పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ని ఆదేశించారు. భవనాలు అందుబాటులోకి రాకపోవడంతో ఇద్దరు, ముగ్గురు డాక్టర్లు ఒకే గదిలో ఉంటూ ఓపీ చూడాల్సిన పరిస్థితి రావడం, గదులు, బెడ్లు సరిపడక ఇటీవల జ్వరాలతో రోగులు పడిన ఇబ్బందులు చూసి బాధేసిందని మంత్రి అన్నారు. ముందుగా కోటిరూపాయలతో బ్లాక్-1 భవనాన్ని పూర్తి చేస్తే కనీసం 50 బెడ్లు, ఇతర సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని వైద్యులు చెప్పడంతో మంత్రి సానుకూలంగా స్పందించారు. ఆస్పత్రి భవన నిర్మాణాలతో పాటు మార్చురీ, ప్రహరీ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఏపీఎంఎస్ డీఈ నరేంద్రరెడ్డిని ఆదేశించారు. ఆస్పత్రి భవన నిర్మాణాలు పరిశీలిస్తున్న సమయంలో మండల కేంద్రంలోని జయంతి కాలనీకి చెందిన మహిళ పొట్నూరి పైడమ్మ మంత్రిని కలిసి తమ ఇల్లు శిథిలమైపోయిం దని, ఇల్లు మంజూరు చేయాలని కోరారు. మంత్రి వెంట ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీష్, తహసీల్దార్ బి.రత్నకుమార్,టీడీపీ నాయకులు మక్కువ శ్రీధర్, పి.వి.వి.గోపాల రాజు, ప్రదీప్ కుమార్, ప్రసాద్ తదితరులున్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న మంత్రి శ్రీనివాస్

ప్రమాదకర స్థాయిలో కాలుష్యం

శృంగవరపుకోట: వాతావరణ కాలుష్యం నానాటికి ప్రమాదస్థాయి దాటిపోతోందని, కాలుష్యం వల్ల ప్రజాజీవితం ప్రమా దంలో పడుతోందని స్థానిక పుణ్యగిరి గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.కేశవరావు అన్నారు. ప్రపంచ కాలుష్య నివా రణ దినోత్సవాన్ని కళాశాలలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రసా యన ఉద్గారాలు, వ్యర్థాల వల్ల గాలి, భూమి, నీటి వనరులు, సహజ వనరులన్నీ కాలుష్యమవుతున్నా యన్నారు. భావితరాల భవిష్యత్ కోసం పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ కె.వాసుదేవరావు, అధ్యాపకులు డాక్టర్ వి.సుధీర్, వలీఖాన్, చల్లా శ్రీనివాసరావు, లక్ష్మణ్, హైమావతి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేశవరావు

సేవా కార్యక్రమాలు అభినందనీయం

చీపురుపల్లి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారితో పాటు వారి సహాయకులకు భోజనం అందించడం అభినందనీయమని సీఐ జి.శంకరరావు అన్నారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 32 మంది రోగులకు, వారి సహాయకులకు శాశ్వత అమృత హస్తం సంస్థ ఆధ్వర్యంలో సోమవారం భోజనం ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమానికి అతిథిగా హాజరైన సీఐ మాట్లాడుతూ అమృత హస్తం సంస్థ చక్కని సేవా కార్యక్రమాన్ని ఎంచుకున్నట్లు చెప్పారు. చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే పేదలకు భోజన సదుపాయం కల్పించడం గొప్ప విషయమన్నారు. వైద్యుడు నాయక్, శాశ్వత అమృత హస్తం పథకం నిర్వాహకులు బి.వి.గోవిందరా జులు, వి.వి.నారాయణమూర్తి, తంగుడు రామకృష్ణ, అంధవరపు హరి, ప్రసాదరావు పాల్గొన్నారు.



భోజనం ప్యాకెట్లు అందజేస్తున్న సీఐ శంకరరావు, తదితరులు

ఉత్తమ వైద్యాధికారిగా అనీల్‌కుమార్



కలెక్టర్ అంబేడ్కర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న వైద్యాధికారి అనీల్‌కుమార్

లక్కవరపుకోట: స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి బి.అనీల్‌కుమార్ జిల్లా ఉత్తమ వైద్యాధికారిగా ఎంపికయ్యారు. ఉత్తమ సేవలందించిన వైద్యులకు ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా ఈనెల 1వ తేదీన జిల్లా కేంద్రం విజయనగరంలో కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందజేశారు. కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్న అనీల్‌కుమార్‌ను స్థానిక పీహెచ్‌సీ సిబ్బందితో పాటు పలువురు అభినందించారు.

ఎక్సైజ్ అధికారుల తనిఖీలు



ఉత్తరావల్లిలోని ఓ పాన్‌షాపులో తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

మెరకముడిదాం: మండలంలోని ఉత్తరావల్లి గ్రామంలో ఉన్న పలు పాన్‌షాపుల్లో ఎక్సైజ్ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. చీపురుపల్లి ఎక్సైజ్ సీఐ చక్రవర్తి సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. మద్యం అక్రమంగా అమ్మకాలు చేపడితే కేసులు నమోదు చేస్తామని దుకాణదారులను హెచ్చరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. చీపురుపల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నవంబరు నెలలో 12 బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించి 205 మద్యం బాటిళ్లను స్వాధీనం చేయడంతో పాటు 12 మందిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

30 ఎకరాల్లో నీటమునిగిన పంట

దత్తిరాజేరు: ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు మండల వ్యాప్తంగా 30 ఎకరాల్లో వరి పంట నీట మునిగినట్లు ఏఓ అనురాధ తెలిపారు. పెదమానాపురం వంగర,ఇంగిలాల్లి, పాచలవలస తదితర గ్రామాల్లో నీటి మునిగిన వరి పంటను సోమవారం ఆమె పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని చెప్పారు.

సంక్షిప్తంగా...

పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలి



విద్యుత్ శాఖాధికారికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు శ్రీనివాస్

గజపతినగరం : పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే రద్దు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గొర్లె శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రభుత్వం తీరుకు నిరసనగా సోమవారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ముందు విద్యుత్ చార్జీల పెంచబోమని చెప్పిన కూటమి నాయకులు మాట నిలబెట్టుకోలేకపోయారన్నారు. ప్రజలకు విద్యుత్ చార్జీల భారం మోపవద్దని కోరారు. అలాగే ఎస్సీ,ఎస్టీలకు విద్యుత్ సబ్సిడీ కొనసాగించాలన్నారు. అనంతరం విద్యుత్ శాఖాధికారికి వినతిపత్రం అందజేశారు.

వక్తృత్వ పోటీల్లో మౌనిక సత్తా



కలెక్టర్ చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న మౌనిక

చీపురుపల్లి: ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి వక్తృత్వ పోటీల్లో పట్టణానికి చెందిన ఆదర్శ డిగ్రీ కళాశాల విద్యార్థిని (ప్రథమ సంవత్సరం) గొర్లె మౌనిక ప్రథమ స్థానంలో నిలిచింది. విద్యార్థినిని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి. కృష్ణాజీ, అధ్యాపకులు సోమవారం అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మౌనిక జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించి, కలెక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ చేతులమీదుగా జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందుకున్నారని చెప్పారు. ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ బి.విజయేశ్వరరావు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుకు 9వ తేదీ వరకు గడువు

చీపురుపల్లి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి చీపురుపల్లి నియోజకవర్గంలో అర్హత కలిగిన ఉపాధ్యా యులు ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 9వ తేదీ వరకు గడువు ఉందని తహసీల్దార్ ఎన్.రాజారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. 2024 నవంబర్ 6 వరకు వచ్చిన దరఖాస్తులకు సంబంధించిన ఓటరు జాబితా ప్రచురించినట్లు స్పష్టం చేశారు. తదుపరి ముసాయిదా జాబితాను ఈనెల 30న ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు. ఇంతవరకు చీపురుపల్లి నియోజకవర్గంలో 206 మంది ఉపాధ్యాయ లు ఓటర్లుగా నమోదయ్యారని తెలిపారు.

సూక్ష్మ, చిన్న పరిశ్రమలపై సర్వే

మెరకముడిదాం: మండలంలో సూక్ష్మ, చిన్న పరిశ్రమలపై సమగ్ర సర్వే చేయాలని సచివాలయ సిబ్బందిని ఎంపీడీఓ జి.భాస్కరరావు ఆదేశించారు. గర్భాం సచివాలయం పరిధిలో చేపడుతున్న సర్వేను సోమవారం ఆయన పరిశీలించారు. సచివాలయం పరిధిలోని పలు సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలకు వెళ్లి వివరాలు దగ్గరుండి సిబ్బందితో నమోదు చేయించారు. అనంతరం సచివాలయంలో సిబ్బందితో సమావేశమయ్యారు. సర్వేలో ఇప్పటివరకు సేకరించిన వివరాలను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. సకాలంలో సర్వే పూర్తిచేయాలని, నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వ్యాపారాలపై ఆరా..

బొండపల్లి: మండల కేంద్రంలోని చిన్న, మధ్యతరహా వ్యాపార సంస్థలను (ఎంఎస్ఎంఈ) ఎంపీడీఓ జి.గిరిబాల సోమవారం పరిశీలించారు. నెలవారీ విక్రయాలు ఎంతవరకు సాగుతున్నాయి... బ్యాంకుల నుంచి రుణాలు ఎంత తీసుకున్నారు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

కోళ్లఫారం తరలించాలంటూ వినతి

శృంగవరపుకోట: జనావాసాల మధ్య ఉన్న కోళ్లఫారంను తరలించాలని రామన్నపాలెం గిరిజనులు కోరారు. ఈ మేరకు సీపీఎం మండల కార్యదర్శి మద్దిల రమణ ఆధ్వర్యంలో తహసీల్దార్ అరుణకుమారిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ, కోళ్లఫారం నుంచి వస్తున్న దుర్వాసనతో గ్రామస్తులు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. కోళ్లఫారం ఏర్పాటు సమయంలో అడ్డుకున్నా ఎవ్వరూ పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కోళ్లఫారంను వేరే ప్రాంతానికి తరలించాలని కోరారు.

జిన్నాంలో వైద్య శిబిరం

గజపతినగరం: జిన్నాం గ్రామంలో సోమవారం నిర్వహించిన వైద్యశిబిరంలో 69 మందికి వైద్య పరీక్షలు చేశామని మరుపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు సుష్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల వల్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. చల్లటి వాతావరణంలో తిరగకుండా, వేడి వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు.

ఘనంగా నిమజ్జనోత్సవం



గౌరీపరమేశ్వరులకు పూజలు చేస్తున్న భక్తులు

వేపాడ: బానాది గ్రామంలో గౌరీ,పరమేశ్వర విగ్రహాల నిమజ్జనోత్సవాన్ని గ్రామస్తులు సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. నెలరోజుల క్రితం ప్రతిష్ఠించిన ఈ విగ్రహాలకు గ్రామస్తులు నిత్య పూజలు చేశారు. నిమజ్జనోత్సవం సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ, ఎంపీటీసీ గొంప తులసి, వెంకటరావు దంపతులు, తదితరులు గౌరీపరమేశ్వరులను దర్శించుకున్నారు.

ధాన్యం మొలకెత్తకుండా చర్యలు



నెలివాడలో తడిసిన వరి చేనుపై ఉప్పు నీటి ద్రావణాన్ని పిచికారీ చేయిస్తున్న ఏడీఏ మహారాజన్

బొండపల్లి/గజపతినగరం: రైతులు వరి పొలాల్లో తుఫాన్ వర్షాలకు చేరిన నీటిని బయటకు మళ్లించాలని గజపతినగరం సబ్ డివిజన్ ఏడీఏ కె.మహారాజన్ రైతులకు సూచించారు. బొండపల్లి మండలంలోని నెలివాడ, గజపతినగరం మండలంలోని పాతబగ్గాం గ్రామంలో పొలాల్లో తడిసిన వరి చేనును సోమవారం ఆయన పరిశీలించా రు. ధాన్యం మొలకెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. తుఫాన్ ప్రభావం తగ్గే వరకు వరి కోతలు కోయవద్దని రైతులకు సూచించారు. బొండపల్లి మండలంలోని గరుడబిల్లి, కనిమెరక గ్రామాల్లో కోతలు చేసి పొలాల్లో ఉన్న వరి పంటను ఏఓ పి.వి.మల్లికార్జునరావు పరిశీలించారు. ధాన్యం మొలకెత్తకుండా ఎకరానికి 20 నుంచి 25 కిలోల చొప్పున ఉప్పును నీటిలో కలిపి వరి పనలపై పిచికారీ చేసుకోవాలని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో పోలిపాడ్యమి పూజలు



చీపురుపల్లి: చీపురుపల్లిలో పూజలందుకుంటున్న ఉమానీలకంఠేశ్వర స్వామి



గజపతినగరం: గజపతినగరం శివాలయంలో ధ్వజ స్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



మెరకముడిదాం: బుధరాయవలసలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద అన్నదానం



చీపురుపల్లి: రేగిడిపేట చెరువులో తెప్పల్లో దీపాలు వదులుతున్న భక్తులు

పోలి పాడ్యమి సందర్భంగా శివాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుఝామున 3 గంటల నుంచే చెరువులు, కోనేరుల వద్ద మహిళలు తెప్పల్లో దీపాలు వదిలారు. అనంతరం శివాలయాలకు వెళ్లి దర్శనం చేసుకున్నారు. పలుగ్రామాల్లో ఆలయ కమిటీలు, కార్తీకమాసం చేసిన భక్తుల ఆధ్వర్యంలో అన్నదానాలు చేశారు.

– చీపురుపల్లి/గజపతినగరం/మెరకముడిదాం